"రామ్మూర్తీ! నన్ను ఎక్కడకు తీసుకువెళ్తున్నావ్?" ఆత్రంగా అడిగాడు వెంకట్రావు.

హీరోహోండా నెమ్మదిగా పోతోంది తారురోడ్డుమీద, నున్నటి గచ్చుమీద ఒలికిన పాల బిందువులా.

"నిన్ను నేను కిడ్నాప్ చెయ్యడం లేదు. ఒక మంచి వ్యక్తి దగ్గరకు తీసుకువెళ్తున్నాను. సరేనా!" సన్నగా నవ్వుతూ చెప్పాడు రామ్మూర్తి.

"ఈరోజుల్లో మంచి వ్యక్తి అంటూ ఎవరూ వుండరు. మామూలు వ్యక్తి, అవసరం పడిన వ్యక్తి, అవసరం తీరిన వ్యక్తి, భవిష్యత్తులో అవసరం వుంటుందేమోనని 'మంచితనం' నటిస్తూ వుండే వ్యక్తి... ఇలా వుంటారు. కానీ నువ్వు చెప్పినట్టుగా నూటికి నూరుశాతం ఇతరుల కోసం జీవించే వ్యక్తులు వుండటం అసంభవం." గట్టిగా అన్నాడు వెంకట్రావు.

"సరే! అదీ చూద్దాం. ఓపిక పట్టు" అని బదులిచ్చి రెండు నిముషాల్లో ఒక పెంకుటింటి ముందు ఆపాడు మోటారు బైక్‌ని రామ్మూర్తి. వెంకట్రావు దిగాక, తానూ బైక్ దిగి స్టాండ్ వేసి గేటు తీసుకొని లోపలకు వచ్చారు రామ్మూర్తి, వెంకట్రావులు.

మొక్కలకి గొప్పులు తవ్వుతున్న ఓ పెద్దాయన వీళ్ళిద్దర్నీ తలెత్తి చూసారు.

'నమస్కారం మాస్టారూ'అని నమస్కరించిన రామ్మూర్తికి "అరుగుమీద కూర్చోండి. వస్తాను" అని బదులిచ్చి పైపు దగ్గరకు వెళ్ళి చేతులు కడుక్కుని భుజంమీది టవల్‌కి తుడుచుకొని వచ్చారు.

అరుగుమీద తుంగచాప మీద కూర్చున్న మిత్రులిద్దరూ మర్యాదకోసం మరొకసారి లేచి నిలబడగా వారించి తనూ వారికి కొద్ది దూరంలో కూర్చున్నారు.

రామ్మూర్తి కుటుంబ సభ్యులందర్నీ పేరుపేరునా అడిగి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వెంకట్రావుకేసి ప్రశ్నార్థకంగా చూసి 'మీ మిత్రులా?' అన్నారాయన.

అవునండి. వీరి పేరు వెంకట్రావు. ఏలూరులో వుంటారు. మా ఊళ్ళో వున్న పాత ఇంటిని అమ్మడానికి వచ్చారు. రేపే రిజిస్ట్రేషన్. చిన్నప్పుడిద్దరం కలిసి చదువుకున్నాం. నేను స్కూలు టీచరుగా వున్నాను. వీరు కమ్మర్షియల్ టాక్సు డిపార్టుమెంటులో ఆఫీసరుగా చేస్తున్నారు.

"మంచిది- నాయనా"అని 'మీకెంతమంది పిల్లలు?'అని ప్రశ్నించారు వెంకట్రావుని.

"ఒక అబ్బాయి, అమ్మాయి. అబ్బాయికి పెళ్ళయ్యింది. స్టేట్సులో వుంటున్నాడు. అమ్మాయి పి.జి. చేసింది. హైద్రాబాదులో కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సులు చేస్తోంది."

"ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం బాగుండలేదంటున్నారేమో...?" సందిగ్ధంగా అడిగారాయన.

"ఒక సంవత్సరమే గ్యాప్ వుంటుంది. తర్వాత మళ్ళీ బూమ్ వుంటుందన్నారు. అయినా స్టేట్స్‌లో సంబంధం కుదరాలంటే కంప్యూటర్ నాలెడ్జి తప్పనిసరి కదండి."

వెంకట్రావు అమెరికా ఆకర్షణకి మనసులోనే నిట్టూర్చారు ఆయన.


"మళ్ళీ ఈమధ్య కొత్త సరుకులేమైనా కొన్నారా సార్?" రామ్మూర్తి ప్రశ్నకు చిరునవ్వు నవ్వి ఇద్దర్నీ లోపలకు తీసుకువెళ్ళారాయన.

టేబుల్ మీద రెండు టవల్స్, జూట్‌తో చేసిన బ్యాగ్‌లు, పూసలు, గవ్వలతో చేసిన వాల్ హేంగింగ్స్ వున్నాయి.

"ఈ టవల్స్ రాజమండ్రి సెంట్రలు జైలు ఖైదీలు నేసినవి, ఈ జ్యూట్‌తో తయారుచేసినవి విశాఖపట్నం అంధ పాఠశాల విద్యార్థినులు, ఈ వాల్ హేంగింగ్స్... ఆ! తునిలోని వృద్ధాశ్రమంలోని పెద్దవారు తయారుచేసినవి."

"సార్! ఇవి నేను పట్టుకెళ్తాను. వీటి ఖరీదెంతో చెప్తారా?"

రామ్మూర్తి ప్రశ్నకు బదులుగా టేబుల్ సొరుగులోంచి ఒక కాగితం మీద వేసిన బిల్లు అతని చేతికిచ్చారాయన. రామ్మూర్తి వెంటనే ఆ డబ్బులు చెల్లించాడు.



# జీవిత సత్యం

- ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి

ఒక అరగంట ఆయన దగ్గర గడిపి శలవు తీసుకుని వెనుదిరిగారిద్దరూ.

"రామ్మూర్తీ! నువ్వు చాలా అమాయకుడివి. అందుకే ఆ ముసలాయన నీకు టోపీ వేస్తున్నాడు. మూడువందలు కూడా ఖరీదుచేయని వస్తువుల్ని నీకు ఆరు వందలకు అంటగట్టాడు. ప్చ్! నువ్వు చాలా నష్టపోతున్నావు. ఆ! నీకు ఇందాకా చెప్పానే 'మంచితనం ముసుగేసుకున్న వ్యక్తి' అని. ఆ కేటగిరీకి చెందిన వ్యక్తి ఈయన."

సడన్‌గా మోటార్ సైకిలు ఆపు చేసాడు రామ్మూర్తి.

"వెంకట్రావ్! దయచేసి ఆయన గురించి ఇంకేమీ మాట్లాడకు" బాధగా అన్నాడు రామ్మూర్తి.

'సారీ మూర్తీ! నువ్వు యింతగా హర్ట్ అవుతావనుకోలేదు' అని మిగతా బాల్యమిత్రుల గురించి పిచ్చాపాటీ మాట్లాడాడు వెంకట్రావు.

మర్నాడు ఇల్లు రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తిచేసుకొని ఏలూరు వెళ్ళిపోయాడు వెంకట్రావు.

* * *

రామ్మూర్తీ, వెంకట్రావు బాల్య స్నేహితులు ముక్కామలలో ఐదో తరగతి వరకూ, ఆ తర్వాత ఖండవల్లి హైస్కూలులో పదవ తరగతి వరకూ కలిసి చదువుకున్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసాక టీచర్ ట్రైనింగ్ తీసుకొని ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు రామ్మూర్తి. వెంకట్రావు మాత్రం డిగ్రీ చదివి సర్వీస్ కమిషన్ పరీక్షలు పాసై ప్రభుత్వోద్యోగంలో చేరి ప్రస్తుతం ఆఫీసరుగా వున్నాడు.

తాను సర్వీసులో వుండగానే నాలుగురాళ్ళు వెనకేసుకోవాలన్నది అతని ధ్యేయం. అందుకే 'పాడి ఆవు'లాంటి పోస్టులో వున్నందుకు కోటి వరకూ వెనకేసాడు. ఎవరూ ఎవరికీ ఏ పనీ ఉచితంగా చేయరని చేయకూడదన్నది కూడా అతని నమ్మిక, సిద్ధాంతం. తన ఇంటి అమ్మకంలో సాయంచేసినందుకు రామ్మూర్తికి కూడా గిఫ్ట్ యిచ్చాడు, అతను వద్దని బ్రతిమాలి కళ్ళనీళ్ళు పెట్టుకున్నా సరే... బలవంతంగా అతని చేతిలో పెట్టాడు.

కొడుకూ, కోడలూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్టేట్స్‌లో వుంటున్నారు. కూతురికి కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని చేస్తే వారు నలుగురూ సుఖంగా, హాపీగా వుంటారన్నది అతని ప్రగాఢ విశ్వాసం. చేతినిండా డబ్బు వుంది కాబట్టి ఎప్పుడు కావలిస్తే అప్పుడు [illegible]ల్ని చూసి రావచ్చన్న ధీమా కూడా వుంది.

ఎం.ఎస్.సి ఫిజిక్స్ చేసిన కావ్యని హైద్రాబాద్‌లో వుంచి కంప్యూటర్స్ చెప్పిస్తున్నాడు వెంకట్రావు. అమీర్‌పేటలోని ఒక పెద్ద ఇనిస్టిట్యూట్‌లో కావ్య కంప్యూటర్స్ నేర్చుకుంటూ ప్రక్కనే ఒక ఎగ్జిక్యూటివ్ లేడీస్ హాస్టలులో వుంటోంది. రూముకు ఇద్దరే వుంటారు. డిస్టబెన్సు వుండదని అతని ఆలోచన. రోజూ ప్రొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం కూతురికి ఫోన్ చేస్తూనే వుంటాడు. ఒక్కోసారి కావ్య విసుక్కుంటున్నా ఫోన్‌లు చేస్తూనే వుంటాడు.

ఆరోజు మధ్యాహ్నం తర్వాత కావ్యనుండి ఫోన్ లేదు. వెంకట్రావు సాయంకాలం ఐదుగంటల నుండి ఫోన్ చేస్తున్నాడు... కవరేజ్ ఏరియాలో లేరని సమాధానం వస్తోంది. ఆమె రూమ్‌మేట్‌కి చేస్తే ఆరోజు ఉదయమే వాళ్ళ ఊరు నెల్లూరు వచ్చిందట తనకీ తెలియదని ఫోన్ చేసింది. హాస్టలు వార్డెన్‌కి ఫోన్ చేస్తే లంచ్ చేసి బయటకు వెళ్తున్నానని చెప్పింది గానీ ఎక్కడికి వెళ్తున్నదీ చెప్పలేదని మిగతా ఫ్రెండ్స్ ఎవర్నీ కలవలేదనీ తామూ ఆందోళన పడుతున్నామని చెప్పింది.

వెంకట్రావు మనసు కీడు శంకించింది. భార్యకు ఈ విషయం తెలిస్తే మరింత కంగారుపడుతుందని ఆఫీసు పనిమీద హైద్రాబాద్ వెళ్తున్నానని చెప్పి టాక్సీలో హైద్రాబాద్ బయల్దేరాడు. ప్రతి ఐదు నిముషాలకి ఫోన్ చేస్తున్నాడు 'స్విఛాఫ్'చేసి వుందని సమాధానం వస్తోంది. ఏం చెయ్యడానికీ పాలుపోక రామ్మూర్తికి ఫోన్ చేసి విషయం అంతా చెప్పాడు.

"కంగారుపడకు వెంకట్రావు. అంతా మంచే జరుగుతుంది. కావ్య క్షేమంగానే వుంటుంది. నీకు ఒక నెంబరిస్తాను. నాన్నగారి దగ్గర చదువుకున్నాయన 'సునీల్'అని పోలీస్ డిపార్టుమెంటులో డి.ఐ.జి. ర్యాంకులో వున్నారు. ఆయన్ని కలుసుకో. తప్పక సహాయం చేస్తారు. అమ్మాయి ఫోన్ నెంబరు నాకియ్యి. నేనూ ట్రై చేస్తాను. నేనూ వద్దామంటే పదవ తరగతి పరీక్షల డ్యూటీ వేశారు.

